క్లుప్తంగా

మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని చామనపల్లిలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులను మంత్రి కొప్పుల ఈశ్వర్ మంజూరు చేశారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం చామనపల్లి మహిళా సంఘం గ్రూప్ సభ్యులకు మంత్రి ప్రొసీడింగ్ కాపీని అందించారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఆర్డీవోతో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రతిమ

కమాన్‌పూర్: రామగిరి మండలం రత్నాపూర్‌లో సింగరేణి సంస్థ ఏర్పాటు చేస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ ఆర్డీవో వీరబ్రహ్మాచారిని కోరారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో 20 గుంటల భూమి ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కేటాయించి నిధులు మంజూరు చేయాలని, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు ఎస్టేట్ అధికారి కనవేన ఐలయ్య, డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్ గౌడ్, జూనియర్ ఎస్టేట్ అధికారి ఆకుల శ్యామల, విద్యుత్ డీఈ జూపల్లి రాంచంద్రరావు, ఏడీ హేమచంద్ర, ఏడీఈ విజయ్ గోపాల్, టెక్నికల్ ఏఈ రామస్వామి ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి సుష్మిత

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో బుధవారం వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి నిరోధక వారోత్సవాల్లో భాగంగా మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో వైద్యాధికారి సుష్మిత మాట్లాడుతూ చిన్న పిల్లలు తీసుకునే వ్యాధి నిరోధక టీకాల అవశ్యకతపై గర్భిణులు, చిన్న పిల్లల తల్లులకు ఆమె వివరించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ వైద్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో కల్లెం రాజారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జయాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బ్లాండీనా, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ బుచ్చమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి సన్మానం



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న చైర్ పర్సన్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో కంటి వెలుగు విజయవంతంగా పూర్తయిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పూర్తి కావడంతో చైర్‌పర్సన్ వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ రాజశేఖర్ డాక్టర్ శ్రీజ, హెచ్ఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీఈవో మానస, కౌన్సిలర్లు రేవల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, మేనేజర్ అలీముద్దీన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేయాలి

డ్రెయినేజీ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత అన్నారు. బుధవారం పట్టణంలోని పూసాల రోడ్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలించి మాట్లాడారు. పూసాల రోడ్‌లో ఇరువైపులా నిర్మిస్తున్న పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. చైర్‌పర్సన్ వెంట నాయకులు ముత్యం రమేశ్, కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ ఉన్నారు.

పాడి పరిశ్రమపై ఎండు గడ్డి భారం

- ఒక్కో గడ్డికట్ట రూ.110
- యంత్రాలతో వరి కోస్తుండడంతో పశుగ్రాసం కొరత
- పశుపోషణ వదిలేస్తున్న రైతన్నలు
- కబేళాలకు తరలిస్తున్న వైనం



హార్వెస్టర్‌తో వరి కోతలు



ఇతర ప్రాంతాల నుంచి గడ్డి తీసుకొచ్చిన పాడి రైతు

ఫెర్టిలైజర్‌సిటీ: ఆధునిక వ్యవసాయంతో రైతులకు పనిభారం తగ్గుతున్నప్పటికీ వ్యవసాయంతో విడదీయలేని అనుబంధంగా ఉన్న పశువులను మాత్రం కష్టపెడుతోంది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో రైతులు కాలువ నీటిపై ఆధారపడి యాసంగిలో వరి సాగు చేసేందుకు విముఖత చూపారు. దీంతో పాలకుర్తి మండల పరిధిలో వేల ఎకరాల్లో పొలాలు బీడు భూములుగా దర్శనమిచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదపై ఆధారపడిన రైతులకు ఎండు గడ్డి, పశువుల దాణా భారంగా మారింది. దీంతో కొందరు రైతులు పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. పాలకుర్తి మండల పరిధిలోని గుంటూరుపల్లి, ఎల్కలపల్లి, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 39 వ డివిజన్ ఖాజీపల్లి రైతులకు పశుగ్రాసం కొరతతో ఇతర ప్రాంతాల నుంచి ఎండుగడ్డి దిగుమతి చేసుకుంటున్నారు.

పశువులకు పశుగ్రాసం కొరత

రైతులు పని భారం తగ్గించుకునేందుకు యంత్రాలతో వరి కోయిస్తున్నారు. సాంప్రదాయ వ్యవసాయంలో కూలీలతో కోయించే వారు. మూడు రోజులపాటు పొలంలోనే వరి మొదలు ఎండగట్టి అనంతరం కల్లం ఏర్పాటు చేసుకోని వరిని కుప్ప కొట్టేవారు. కుప్ప కొట్టిన గడ్డిని ఎడ్ల సాయంతో బంతిగా తొక్కించే వారు. ధాన్యం తొలగించిన గడ్డిని కట్టలుగా కట్టి గడ్డివాములు ఏర్పాటు చేసేవారు. ఈ పద్ధతితో గడ్డి వృథా కాకుండా ఏడాది పొడవునా పశువుల కు గ్రాసంగా ఉపయోగపడేది. వరి కోత యంత్రాల రాకతో పరిస్థితి మారిపోయింది. తక్కువ ఖర్చు, సమయం ఆదా అవుతోంది. ఏటా రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో పశుగ్రాసం కొరత ప్రతీ ఏటా పెరుగుతోంది.

ఒక్కో గడ్డి కట్ట 110 రూపాయలు పైనే వెచ్చించాలి

పశువులకు పశుగ్రాసంగా ఎండు గడ్డిని ఉపయోగిస్తారు. పెద్దపెల్లి జిల్లాలో యాసంగిలో రైతులు వరి పొలాలు తక్కువగా చేయడంతో గడ్డి కొరత ఏర్పడింది. పశు సంపదపై ఆధారపడ్డ పాడిన పాడి రైతులు ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఒక గడ్డి కట్ట రూ. 100 నుంచి 130 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు డీజిల్ ధరలు, కూలీల ధరలు రెట్టింపు కావడంతో పాడి రైతుపై ఆర్థికభారం పడుతోంది. జిల్లాలో పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గడ్డి గింజలు అందించాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో అరకొరగా పండించిన వరి పంటను యంత్రాల సాయంతో కోస్తున్నారు. దీంతో 50 శాతం మేర గడ్డి కొరత ఏర్పడుతోంది. పొలాలను యంత్రాల సాయంతో కోయడంతో గడ్డి 40 శాతం మేర మాత్రమే పశుగ్రాసంగా చేతికి వస్తోంది. పాడి రైతులు ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల నుంచి ఎండుగడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందించాలి



రైతులు యాసంగి పొలాలు చేయకపోవడంతో గడ్డి కొరత ఏర్పడింది. ఇతర ప్రాంతాల నుంచి ఎన్ని గడ్డి దిగుమతి చేసుకోవడానికి రైతులపై ఆర్థికభారం పెరుగుతోంది. ఒక్కో గడ్డి కట్ట రూ.100 నుంచి 130 వరకు వెచ్చించాల్సి వస్తుంది. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందించాలి.

– ఈర్ల శ్రీనివాస్, పాడి రైతు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎలిగేడు మండలంలోని ధూళికట్ట, ఎలిగేడులో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. బస్తాకు ప్రభుత్వం నిర్ణయించిన తూకం మాత్రమే వేయాలని ఎక్కువగా వేయడానికి వీలులేదని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, రైతు సమన్వయసమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, సింగిల్ విండో చైర్మెన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచులు గొల్లె కావేరి, సింధూజ, కొండాల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, సీఈవో విక్రమ్, టీసెర్ప్ ఏపీఎం సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్, పెద్దాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఎంపీపీ రమాదేవితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, పత్తిపాక పీఏసీఎస్ చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీ దండె వెంటేశం చొక్కారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, తుర్కలమద్దికుంట, కాసులపల్లి తదితర గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో విండో చైర్మన్ నర్సింహరెడ్డి, జెడ్పీటీసీ రామ్మూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిరుద్యోగ నిరసన దీక్షలో జిమ్మిబాబు

గోదావరిఖని: నిరుద్యోగ దీక్ష చేపట్టిన వైఎస్ షర్మిళకు రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు మద్దతు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన నిరుద్యోగ నిరసన దీక్షలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మేలు

జ్యోతినగర్: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలుకలుగుతుందని వ్యవసాయాధికారి ప్రకాశ్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లో బుధవారం రైతులతో మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం 14 మంది రైతులు, 32 ఎకరాల ఆయిల్ పామ్ సాగు కోసం ఎకరానికి రూ.1140 చొప్పున డీడీలు తీసి అందించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, రైతు బంధు సమితి కో–ఆర్డినేటర్ రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే ఇళ్ల స్థలాలు

జ్యోతినగర్: నకిలీ పట్టా పొంది అక్రమంగా స్థలంలో నిర్మాణ పనులు చేపట్టిన వ్యక్తిని బైండోవర్ చేసినట్లు రామగుండం తహసీల్దార్ జాహెద్ పాషా తెలిపారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో కొందరు నకిలీ పట్టాలు సృష్టించి నిర్మాణాలు చేస్తుండడంపై విచారణ చేపట్టామన్నారు. అందుగుల పల్లె గ్రామానికి చెందిన పుల్లూరి శ్రీనివాస్ ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా నిర్మాణం చేస్తున్నట్లు గుర్తించి అతడికి ఆరు నెలల జైలు శిక్ష, లక్ష రూపాయల మేరకు బైండోవర్ చేసామని తెలిపారు. నిర్మించిన కట్టడాన్ని కూల్చివేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఏడుగురిని రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. వారిపై ఎన్టీపీసీ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 29న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. పెద్దపల్లి మండలంలోని మారెడుగొండలో బుధవారం పరిసర గ్రామాలకు చెందిన హమాలీ కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు వెంకటేశ్వర్ రావు, తిరుపతి, సమ్మయ్య, సంతోష్, కొమురయ్య, గంగయ్య తదితరులున్నారు.

జ్యోతినగర్: ఈ నెల 29న హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో హమాలీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్‌లోని హమాలీ సంఘం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం రామాచారి, కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి పోస్టర్లు ఆవిష్కరించారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు లయిన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి సభ్యుడు పోరండ్ల పరమేశ్వర్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించడానికి రూ. 25 వేల విలువ గల టీవీని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్కం రవీందర్, పాఠశాల హెచ్ఎం నీరజ, బెల్లంకొండ విజయపాల్‌రెడ్డి, లయిన్స్ క్లబ్ అధ్యక్షుడు రేకులపల్లి శశాంక, సాదుల వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ సుద్దాల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారాలు నమ్మొద్దు'

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని రావూస్ స్కూల్‌కు అనుమతి లేదని, అద్దె చెల్లించలేని స్థితిలో ఉన్నారని, స్కూల్ మూసేస్తున్నారని బిల్డింగ్ ఓనర్ తమపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని స్కూల్ చైర్మన్ ప్రభాకర్‌రావు అన్నారు. స్కూల్ బిల్డింగ్ ఓనర్‌కు 2022 నుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించామని, ఒప్పుకున్న దానికన్నా అదనంగా ఇచ్చామన్నారు. కొంత కాలంగా కావాలనే వివాదం సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ నెల 25న యజమాని అనుచరులు గొడవ చేసి, సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారని, ఈ విషయంపై బిల్డింగ్ ఓనర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30న రేషన్‌డీలర్ల చలో కరీంనగర్

ఓదెల: రేషన్ డీలర్ల గౌరవవేతనం కోసం ఈ నెల 30న చలో కరీంనగర్ తలపెట్టనున్నట్లు రేషన్‌డీలర్ల సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధానకార్యదర్శి మద్దెల నర్సయ్య తెలిపారు. బుధవారం ఓదెలలో మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చలో కరీంనగర్ కార్యక్రమానికి జిల్లా నుంచి అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు శ్రీనివాస్, నాగరాజు, ముత్యాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్

జూలపల్లి: బీఎస్పీ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన మామిడిపెల్లి చంద్రశేఖర్‌ను నియమిస్తూ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేగ నరేశ్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని, తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ప్రధాన కార్యదర్శికి, రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

రామగుండం: పట్టణానికి చెందిన ఇల్లందుల శ్రీనివాస్ రామగుండం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు కోలేటి రమేశ్, ఎలక్షన్ కన్వీనర్ కొమురవెల్లి రాజేందర్, పట్టణ మాజీ అధ్యక్షుడు కాసనగొట్టు శ్యాంసుందర్ సమక్షంలో జరిగిన సభ్యుల సమావేశంలో పలువురు శ్రీనివాస్‌ను ప్రతిపాదించడంతో ఏకగ్రీవంగా ఎంపికైనట్లు నియామకపత్రాలు అందజేశారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తాటిపల్లి శివప్రసాద్, పాత శ్రీనివాస్, రామిని శేఖర్, ఇరుకుళ్ల లక్ష్మణ్, తాటిపెల్లి కృష్ణమూర్తి, పైడ గంగాధర్, బీరెల్లి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ అధ్యక్షుడిగా పెంట కుమారస్వామి

జ్యోతినగర్: బీజేపీ మల్కాపూర్ మండలం అభయాంజనేయ శక్తి కేంద్రంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. బుధవారం మల్కాపూర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి రామ స్వరూప ఆధ్వర్యంలో 41 బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షుడిగా పెంట కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా బోరిగం శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎడ్ల ప్రేమ్ కుమార్‌ను రామగుండం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పిడుగు కృష్ణ ముదిరాజ్, మల్కాపురం మండల మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్ కుమార్ బూత్ కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో బుంగ మహేశ్, శ్రీకాంత్, డివిజన్ బూత్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బొక్కలవాగుపై వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

కమాన్‌పూర్: ఆర్జీ–3 పరిధిలోని అడ్రియాల గని సమీపంలోని బొక్కలవాగుపై వంతెన నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆర్జీ–3 ఏపీఏ టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య బుధవారం తెలిపారు. బొక్కలవాగుపై వంతెన లేకపోవడంతో అడ్రియాల గనికి వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతుండేవారు. కార్మికుల ఇబ్బందులపై టీబీజీకేఎస్ కార్మిక సంఘం ప్రతినిధులు సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వంతెన నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. కొద్ది రోజుల్లో వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు శంకరయ్య తెలిపారు. వంతెన నిర్మాణానికి కృషి చేసిన కార్మిక సంఘం అధ్యక్షుడు వెంట్రావ్, జనరల్ సెక్రెటరీ మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాస్, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఏఎల్‌పీ పీవో నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతలు అధైర్యపడొద్దు



ధాన్యం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుట్ట శైలజ

మంథని: అకాలవర్షంతో పంటలు దెబ్బతిన్న అన్నదాతలు అధైర్యపడొద్దని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ అన్నారు. బుధవారం మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు, గంగాపురి, శ్రీరాంనగర్, పవర్‌హౌస్ కాలనీ, అంగుళూరు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. దెబ్బతిన్న పంట నష్టం అంచనా వేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీపీ కొండ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సొసైటీ డైరెక్టర్లు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి



కొనుగోలు కేంద్రంలో ప్రజాపంథా నాయకులు

రామగుండం: ఇటీవల అకాల వర్షాలు, వడగండ్లతో తడిసిన వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని, వర్షాలతో నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. అంతర్గాం మండలంలోని ఎగ్లాస్‌పూర్, పొట్యాల, ఆకెనపల్లి, సోమనపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న మాట్లాడుతూ రైతులు ధాన్యం పది రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా తూకం వేయలేదన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఓదెల: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రైతు హక్కుల సంఘం కార్యదర్శి బియ్యపు శంకర్‌యాదవ్ అన్నారు. మండలంలోని గోపరపల్లె, కొలనూర్ గ్రామాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తుంగాని సాయిలు, జిల్లాకమిటీ సభ్యులు మేకల రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలి

సుల్తానాబాద్‌రూరల్: వడగండ్ల వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, ఐతరాజుపల్లి, భూపతిపూర్‌లో దెబ్బతిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. రూ.10వేలు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు నయా పైసా ఇవ్వలేదన్నారు. రైతులకు పరిహారం చెల్లించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, మనోహర్, శ్రీనివాస్, సంతోష్, కిరణ్ తదితరులున్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

మంథని: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మంథని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మంథనిలో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీను బాబు, మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్‌రెడ్డి పరిశీలించారు. అకాల వర్షాలతో అన్నదాతలకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన ధాన్యం వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆజీంఖాన్, ఎరుకల ప్రవీణ్, అయిలి ప్రసాద్, బండారి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని కార్యదర్శుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఎలిగేడు: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి రెగ్యులర్ చేయాలని కోరుతూ బుధవారం ఎలిగేడులో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాడ కొండాల్‌రెడ్డికి, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీపీ అరెల్లి దేవక్కకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఆకాశ్, కరీమా, పరశురాం, శ్రీనివాస్, అమల, స్వాతి, రమ్య, రమ, తదితరులున్నారు.

వైభవంగా ఎల్లమ్మ, బీరప్ప పట్నాలు



సుల్తాన్‌పూర్ ఎల్లమ్మతల్లి ఆలయంలో పట్నాలు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో శ్రీరేణుకాఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నంను, మండలంలోని లాలపల్లిలో బీరన్న పట్నాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు ఎల్లమ్మ తల్లికి పట్నం వేసి, ఎల్లమ్మ కథను ఆలపించారు. లాలపల్లి బీరన్న పట్నం వేసి, బీరన్న కథ ఆలపించారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుల హరీశ్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె వీరస్వామిగౌడ్, ఉపాధ్యక్షుడు ఆకుల తిరుపతిగౌడ్, మాజీ సర్పంచ్ కొండ తిరుపతిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరం ఎత్తివేత ప్రభుత్వ కుట్ర



ఓదెల: పెద్దపల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ల కోసం చేస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరం ఎత్తివేయడం వెనుక ప్రభుత్వ హస్తం ఉందని నియోజకవర్గ మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్న ఆరోపించారు. బుధవారం ఓదెలలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. నియోజకవర్గంలో బీఎస్పీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే దీక్షా శిబిరాన్ని తొలగించారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధానకార్యదర్శి సాతుర్తి అనిల్, మండలప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్, మండల మహిళా కోకన్వీనర్ బుడుగు మానస, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు, ఎద్దు మృతి

గోదావరిఖనిటౌన్: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన జనగామ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రైతులు గుండ బోయిన పోషం, రుద్రబట్ల అశోక్‌రావుకు చెందిన రెండు గేదెలు బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి మృతి చెందాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎర్త్ వైర్‌కు విద్యుత్ సరఫరా జరిగి పశువులు మృత్యువాత పడ్డట్టు రైతులు చెబుతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గేదెలు మృతి చెందాయని, తమకు నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

మంథని: ముత్తారం మండలం హరిపురంలో గోసుకల కొమురయ్యకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడింది. గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలోకి ఎద్దులను తీసుకొని వెళ్లి పనిచేసుకుంటూ ఉండగా మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో మృతిచెందినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.